సీఎం రేవంత్‌ను కలిసిన భూపాల్



సీఎం రేవంత్‌రెడ్డితో కమిషనర్ దేశపాల్ భూపాల్

రాజేంద్రనగర్: సమాచార హక్కు చట్టం కమిషనర్‌గా నియమితులైన దేశపాల్ భూపాల్ మంగళవారం ఉదయం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్‌ను మర్యాపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపిన అనంతరం ఇద్దరు కలిసి సీఎం నివాసానికి వెళ్లి రేవంత్‌రెడ్డిని కలిశారు. ఆయనకు కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు.

మోతాదు ఎరువులే వాడాలి



కవేలిగూడలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త సుకృత్‌కుమార్

శంషాబాద్ రూరల్: పంటలకు తగిన మోతాదులోనే ఎరువులు వాడాలని అఖిల భారత సూక్ష్మపోషకాల విభాగం శాస్త్రవేత్త డాక్టర్ టి.సుకృత్ కుమార్ సూచించారు. మండలంలోని కవేలిగూడలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సాగులో యాజమాన్య పద్ధతులు, ఆధునిక సాగు విధానంపై అవగాహన కల్పించారు. భూసార పరీక్షలు నిర్వహించి సూచన మేరకు ఎరువులు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్వేత, ఏఈఓ సురేశ్‌రెడ్డి, రైతులు, పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానం



విద్యార్థిని వర్షినికి పురస్కారం అందజేస్తున్న ఎల్లయ్య

శంషాబాద్ రూరల్: మండలంలోని పెద్దషాపూర్ జడ్పీ పాఠశాల విద్యార్థిని పూజ పదో తరగతి పరీక్షల్లో జిల్లాస్థాయిలో మూడో ర్యాంకు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. దీంతో మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య విద్యార్థినికి రూ.10 వేల నగదు పురస్కారాన్ని మంగళవారం అందజేశారు. అలాగే ఇదే పాఠశాలకు చెందిన సిద్ధు, వర్షినికి రూ.5 వేల చొప్పున ఇచ్చి వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నర్సింహ, ప్రధానోపాధ్యాయుడు గోపాల్, ఉపాధ్యాయుడు బాల్‌రాజు, మాజీ సర్పంచ్ చెక్కల చంద్రశేఖర్, స్థానికులు గణేశ్, నారాయణ, రవినాయక్, కేశంపేట, మహేశ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

వీర జవాన్ మురళీనాయక్‌కు ఘన నివాళి



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: ఐక్యత వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శివరాంపల్లి ప్రశాంత్‌కాలనీలో కొవ్వొత్తులతో ర్యాలీ తీసి అమరజవాన్ మురళీనాయక్‌కు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు డి.రమేశ్, అధ్యక్షుడు పి.వెంకటేశ్, ఉపాధ్యక్షులు డి.ఆంజనేయులు, రమాకాంత్ మాట్లాడుతూ.. పాకిస్తాన్ ఆడుతున్న నాటకాలను భారత ప్రభుత్వం ఏ మాత్రం సహించదని వారికి మన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ర్యాలీలో అనిల్ కుమార్, గోపాల్ రెడ్డి, రమాకాంత్, సిద్ధం శ్రీనివాస్, శ్రీనివాస్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించండి

రాయదుర్గం: జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ బోర్కాడే హేమంత్‌ను దివ్యాంగుల సంఘం శేరిలింగంపల్లి ప్రతినిధులు మంగళవారం కలిశారు. నియోజకవర్గంలో దివ్యాంగుల సమస్యలను ఆయనకు వివరించారు. అర్హులైన వారందరికీ న్యాయం జరిగేలా చేయాలని కోరారు. అనంతరం దివ్యాంగుల చట్టం 2016 పుస్తకాన్ని అందించారు. కార్యక్రమంలో సంఘం శేరిలింగంపల్లి అధ్యక్షుడు అశోక్‌కుమార్ ముదిరాజ్, నాయకులు వెంకటేష్, రాము పాల్గొన్నారు.

కంచె కరువాయే..!



రోడ్డు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

- పద్మశాలీపురంలో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్
- కాలిన కేబుల్ వైర్లు, పట్టని అధికారులు



కాలిపోయిన ట్రాన్స్ ఫార్మర్ కేబుల్ వైర్

మైలార్‌దేవ్‌పల్లి: డివిజన్ పరిధి పద్మశాలీపురంలోని ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. అసలే రోడ్డు పక్కన..ఆపై దాని చుట్టూ కంచె లేకపోవడంతో ఆ దారి గుండా వెళ్లేవారు బిక్కుబిక్కుమంటున్నారు. మరోవైపు వాటి కేబుల్ వైర్ల రబ్బర్ ఖాళీ పోయి ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ ముందు రేషన్ షాపు ఉన్నది. ప్రతినెల రేషన్ బియ్యం తీసుకునేందుకు అనేక మంది లబ్ధిదారులు బారులు తీరుతుంటారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్ విషయమై పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని రేషన్ డీలర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగితేనే అధికార యంత్రాంగం కదులుతుందా..? అని స్థానిక ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. వచ్చేది వర్షాకాలం నీటితో ట్రాన్స్‌ఫార్మర్ భూమి పచ్చిగా ఉండి అటు నుండి వెళ్లే వారు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుంచి పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు..



కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉన్నది. వాటి కేబుల్ వైర్ పూర్తిగా కాలిపోయింది. స్థానిక లైన్ మెన్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినం. అయితే ఆఫీస్‌లో కేబుల్ వైర్ లేదని సమాధానం ఇస్తున్నాడు. చిన్నారులు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు వాటికి తాకితే ప్రాణ నష్టం జరుగుతుంది. అధికారులు సత్వరమే స్పందించి కంచె ఏర్పాటు చేసి కేబుల్స్ మార్చాలని లేకుంటే పక్కనే ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేయాలి.

–మసున గిరి, పద్మశాలీపురం

'ఆపరేషన్ సిందూర్'తో పాకిస్తాన్‌కు గుణపాఠం



భారత మాజీ సైనికుడు చల్లా వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

అత్తాపూర్: కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ సిందూర్'తో పాకిస్తాన్‌కు గుణపాఠం చెప్పిందని ఇందులో మన సైన్యం చేసిన తెగువ ధైర్యం ఎంతో గొప్పదని తెలంగాణ ఎకనామిక్ ఫోరం అధ్యక్షుడు, రచయిత నేదునూరి కనకయ్య అన్నారు. లక్ష్మీనగర్ జీహెచ్ఎంసీ పార్కులో ఉగ్రవాదాన్ని అరికట్టడంలో 'ఆపరేషన్ సిందూర్ పాత్ర' అనే అంశంపై సమావేశాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉగ్రదాడిలో మరణించిన వారికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం భారతీయ ఆర్మీలో విశేష సేవలు చేసి పాకిస్తాన్‌తో జరిగిన కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికుడు చల్లా వెంకట్‌రెడ్డిని శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 9 ఉగ్ర స్థావరాలను మట్టుబెట్టిన వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్, కల్నల్ సోఫియా భారత మహిళా శక్తిని ప్రపంచానికి చాటారన్నారు. కార్యక్రమంలో అత్తాపూర్ యోగా సెంటర్ అధ్యక్షుడు డాక్టర్ బి.సీతారాం, కన్వీనర్ మహేందర్, కార్యనిర్వాహక అధ్యక్షులు బి.భానుమతి, నాగేశ్వర్‌రావు, నరేశ్, గోపాల్‌రెడ్డి, శ్రీకాంత్, భోజిరెడ్డి, కె.మూర్తిరాజు, మనోహర్‌రావు, బాలకృష్ణ, చిన్న, సరిత పాల్గొన్నారు.

వినాయక్‌నగర్ బస్తీలో 'శుభోదయం మైలార్‌దేవ్‌పల్లి'



వినాయక్‌నగర్‌లో పర్యటిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి: 'శుభోదయం మైలార్‌దేవ్‌పల్లి' కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వినాయక్‌నగర్ బస్తీలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్ మాట్లాడుతూ.. చాలా ప్రాంతాల్లో సమస్యలు నెలకొన్నాయన్నారు. అయినా పరిష్కరించడంలో అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు చొరవ చూపడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.రాముయాదవ్, యూత్ అధ్యక్షులు అక్కం రాఘవేందర్ యాదవ్, రాజేశ్, సోమ శ్రీనివాస్‌గుప్తా, చిరంజీవి, అరుణ్ ముదిరాజ్, ఎడ్లకాడి సూర్యం, కొంపల్లి జగదీశ్, ఈర్లపల్లి ప్రవీణ్, భగవాన్‌దాస్, సరితా, మహేశ్, రాజు, వెంకటరమణ, రాజు, భాస్కర్, అశోక్‌కుమార్, మల్లేశ్, శేఖర్, భూదేవి, అరుణరెడ్డి, లక్ష్మీదేవి, పారిజాతం, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న నిందితుడి అరెస్ట్



నిందితుడితో పోలీసులు

రాజేంద్రనగర్: అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని శంషాబాద్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సాలోని గజపతి జిల్లాకు చెందిన సుదీప్ కుమార్ జెన మంగళవారం రాజేంద్రనగర్ పీవీ నర్సింహా రావు ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నంబర్ 240 నుంచి అక్రమంగా గంజాయిని తరలిస్తున్నాడు. విశ్వసనీయమైన సమాచారం అందుకున్న శంషాబాద్ పోలీసులు దాడులు చేసి సుదీప్ కుమార్‌ను అరెస్ట్ చేసి 11.825 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సుదీప్ కుమార్ గుర్తు తెలియని వ్యక్తి వద్ద నుంచి గంజాయిని కొనుగోలు చేసి నగరానికి తీసుకొచ్చి ఆరాంఘర్, చింతల్‌మేట్ తదితర ప్రాంతాల్లో అవసరమైన వారికి విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో తెలిపాడు.

ప్రశాంతంగా పాలిసెట్ ప్రవేశ పరీక్ష

రాయదుర్గం: పాలిసెట్–2025 ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మంగళవారం శేరిలింగంపల్లి పరిధిలో 5 పరీక్షా కేంద్రాలలో ఈ ప్రవేశ పరీక్షను నిర్వహించారు. మధురానగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 192 మంది విద్యార్థులకు గాను 162 పరీక్ష వ్రాశారు. అదేవిధంగా జెడ్పీహెచ్ఎస్ మణికొండలో 288 మందికి 259 మంది, జెడ్పీహెచ్ఎస్ నార్సింగిలో 240 మందికి 214 మంది, జెడ్పీహెచ్ఎస్ గచ్చిబౌలిలో 288 మందికి 251 మంది, రాయదుర్గంలోని జీఐఎల్‌టీలో 125లో 109 మంది పరీక్షలు రాశారు. మొత్తం అయిదు పరీక్షా కేంద్రాలలో 1133 మందికి గాను 995 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని ఎక్బాల్‌హుస్సేన్ వివరించారు.

బస్తీ, కాలనీల అభివృద్ధికి కృషి



నానక్‌రాంగూడలో పర్యటిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, ఏఈ రషీద్

రాయదుర్గం: ప్రతి బస్తీ, కాలనీని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి స్పష్టం చేశారు. గచ్చిబౌలి డివిజన్‌లోని నానక్‌రాంగూడలో రూ.68 లక్షలతో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను మంగళవారం జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని కాలనీలు, బస్తీలలోని అంతర్గత రోడ్లన్నింటినీ సీసీరోడ్లుగా మారుస్తున్నామన్నారు. అనంతరం ఆయన స్థానికులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ రషీద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు శివాసింగ్, నాయకులు కైలాష్‌సింగ్, బీరేందర్‌సింగ్, నిరంజన్‌గౌడ్, ప్రవీణ్, సతీష్, సుమన్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

సిద్ధిఖీనగర్ అభివృద్ధికి సహకారమందిస్తా



ఎమ్మెల్యే గాంధీని సన్మానించిన సిద్ధిఖీనగర్‌వాసులు

గచ్చిబౌలి: సిద్ధిఖీనగర్ కాలనీ అభివృద్ధికి అందరి సహకారం అవసరమని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. కొండాపూర్ డివిజన్‌లోని సిద్ధిఖీనగర్‌కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు మంగళవారం గాంధీని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలో వసతుల కల్పనకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి, కోశాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మణికొండ: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మంచిరేవుల గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముదిమల రాజేశ్ (50) కుటుంబంతో కలిసి ఇందిరమ్మ కాలనీలో ఉంటున్నాడు. మంగళవారం భవనంపై పిల్లర్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుమారుడు విజయ్‌కుమార్ ఉదయం గ్రామంలో పాల సరఫరా చేసి 8 గంటలకు ఇంటికి వచ్చాడు. తండ్రి ఫోన్ ఇంట్లోనే ఉండడం, దానికి కాల్ రాగా తీసుకుని మేడపైకి వెళ్లేసరికి ఉరేసుకుని కనిపించాడు. వెంటనే చుట్టుపక్కల వారిని పిలిచి లంగర్‌హౌస్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఆత్మహత్యపై ఎలాంటి అనుమానాలు లేవని కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియాకు తరలించి పూర్తయిన తర్వాత కుటుంబ సభ్యులకు అప్పగించామని పోలీసులు తెలిపారు.

చదువుతూనే ఉద్యోగాలు సాధించడం అభినందనీయం



క్యాంపస్ సెలెక్షన్స్‌లో అధికారులు

ఏజీవర్సిటీ: కొండా లక్ష్మణ్ ఉద్యానవన విద్యార్థులకు నాలుగో సంవత్సరంలోనే ఉద్యోగావకాశాలు రావడం అభినందనీయమని అసోసియేట్ డీన్ ప్రశాంత్ అన్నారు. ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రాంగణంలో క్యాంపస్ సెలెక్షన్స్ మంగళవారం నిర్వహించారు. ఇందులో హిందుస్తాన్ యూనిలీవర్ లిమిటెడ్ కామారెడ్డి, ప్రీ యూనిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మెదక్‌కు చెందిన కంపెనీలు పాల్గొని విద్యార్థులకు మౌకిక పరీక్షలు నిర్వహించి ఎంపిక చేశారు. రెండు సంస్థల నుంచి ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్, క్లస్టర్ మేనేజర్ ఉద్యోగాలకు 10 మంది ఎంపికయ్యారు. కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికులకే చెత్తను అందించాలి



చెత్త సేకరణను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ కార్మికులకే చెత్తను అందించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. పదో డివిజన్‌లోని హెచ్‌డబ్ల్యూఎంబీఎస్ కాలనీ, 11వ డివిజన్‌లోని దుర్గాఖలీజ్‌ఖాన్‌లో డోర్ టూ డోర్ చెత్త సేకరణ ప్రక్రియను, అలాగే 12వ డివిజన్‌లోని హిమాయత్‌సాగర్‌లో స్వీపింగ్ పనులను మంగళవారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాల శుభ్రత అందరి బాధ్యతగా భావించాలన్నారు. చెత్తను రోడ్లకిరువైపులా, ఖాళీ ప్రదేశాల్లో వేయవద్దని కోరారు. కార్యక్రమంలో శానిటరీ జవాన్లు మీర్జా తౌఫిక్, రాము తదితరులు ఉన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

మణికొండ: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ గండిపేట మండల కన్వీనర్ డి. ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో కార్మికులతో కలిసి సమ్మె పోస్టర్‌ను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాలుగా కార్మికులు పోరాటం చేసి సాధించిన హక్కులను కాలరాసేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. కొత్తగా వచ్చే లేబర్ కోడ్స్ అమలైతే కార్మిక సంఘాల ఉనికి ప్రశ్నార్థకం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని రద్దు చేయడంతో పాటు కార్మికులకు కనీసం వేతనం రూ. 26 వేలు, ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో సమ్మె నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక నాయకులు మహిపాల్ యాదవ్, అహ్మద్, జనార్దన్‌రెడ్డి, వంశీ, శ్రీకాంత్, బాబు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికల స్థలాలను కాపాడుతాం



పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: శ్మశానవాటికల స్థలాలు కబ్జాకు గురికాకుండా కాపాడుతామని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని వినాయకనగర ప్రాంతంలో శ్మశానవాటిక స్థలం కబ్జాకు గురవుతుందని వడ్డెర సంఘం సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ప్రహరీ, వెయింటింగ్ హాల్, బోర్, తాగునీరు, టాయిలెట్స్ తదితర విషయాలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో సంపంగి నర్సింహ, బాలరాజు, శ్రీను, బోధస్ హరికృష్ణ, శ్రీను, రాజు, ప్రసాద్, సురేశ్, ఎన్ను శ్రీనివాస్‌రెడ్డి, ఎన్ను శంకర్‌రెడ్డి, దండుగుల ప్రసాద్, ఇంద్ర తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి నల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



పోస్టర్ ఆవిష్కరణలో దేవాలయ, ప్రణవ భక్త సమాజం సభ్యులు

అత్తాపూర్: డివిజన్‌లోని హైదర్‌గూడలో గల నల్ల పోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలను ఈనెల 21 నుంచి 23 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు బాబూ జగ్జీవన్‌రామ్ యూత్ అసోసియేషన్ సభ్యులు, ప్రణవ భక్త సమాజం సభ్యులు తెలిపారు. మంగళవారం ఆలయ ఆవరణలో మహోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దేవాలయంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాలను వివిధ రకాల పూలు, విద్యుద్దీపాలతో ముస్తాబు చేస్తున్నామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో బాబూ జగ్జీవన్‌రామ్ యూత్ అసోసియేషన్ సభ్యులు, హైదర్‌గూడ ప్రణవ భక్త సమాజం సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

ఇల్లు అమ్మేసి..గెంటేశారు..!

- తల్లిదండ్రులను వదిలించుకున్న కుమారులు
- ఆలయంలో తలదాచుకుంటున్న వైనం
- న్యాయం చేయాలని ఆర్డీఓకు వినతి



నార్సింగి లక్ష్మమ్మ ఆలయం పక్కన పడుకున్న వృద్ధులు

మణికొండ: జీవిత చరమాంకంలో అండగా ఉంటారనుకున్న కుమారులు రోడ్డు పాలు చేశారు.. కూతురైన కరుణించకపోతుందా అనుకుంటే ఆమె సైతం సోదరులతోనే చేతులు కలిపింది. వారందరూ కలిసి ఇంటిని అమ్మేసి తల్లిదండ్రులను బయటకు గెంటేశారు. ఈ ఘటన నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. రంగుల కొమరయ్య, లక్ష్మమ్మకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కొమరయ్య రంగులు వేసే పనిచేసి నార్సింగిలో 150 గజాల్లో ఇంటిని నిర్మించుకుని పిల్లలను పెంచి పెద్ద చేసి వారందరికీ వివాహాలు చేశారు. అయితే ఇంటిని కుమారులు, కూతురు కలిసి ఇటీవల రూ.60 లక్షలకు అమ్మేసి ముగ్గురు రూ. 20 లక్షల చొప్పున పంచుకున్నారు. తర్వాత తల్లిదండ్రులను భారంగా భావించి ఇంట్లో నుంచి గెంటేశారు. దీంతో దిక్కుతోచని స్థితిలో గ్రామంలోని లక్ష్మమ్మ ఆలయ ఆవరణలో నివసిస్తున్నారు. కుమారులు, కూతురు స్థానికంగానే ఉన్నా వారికి అన్నం పెట్టడం లేదు. దాంతో వారం రోజులుగా ఆలయం చుట్టు పక్కల వారి ఇళ్లకు వెళ్లి అడుక్కు తింటున్నారు.

ఆర్డీఓకు ఫిర్యాదు..

స్థానిక మాజీ కౌన్సిలర్ ఉషారాణి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లక్ష్మీబాయితో కలిసి కొమరయ్య రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్‌రెడ్డికి మంగళవారం ఫిర్యాదు చేశారు. తనకు వచ్చే రూ. 2వేల పింఛన్ రూ.5 వేలు అవుతుందని, సంతకం పెట్టాలని తీసుకెళ్లి తనను మోసం చేశారని కొమరయ్య ఆర్డీఓతో రోధిస్తూ చెప్పాడు. తన ఇంటిని తిరిగి ఇప్పించాలని, తమను ఆదుకోవాలని కోరారు.



రాజేంద్రనగర్ ఆర్డీఓకు ఫిర్యాదు చేస్తున్న కొమరయ్య